క్లుప్తంగా

ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న కమిషనర్

రాయికల్: మున్సిపల్‌లోని గృహ యజమానులు వందశాతం ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్వయంగా కమిషనర్ వెళ్లి ఇంటి పన్ను వసూలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పెగడపల్లి: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడిని ఆదుకునేందుకు మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం అందించారు. గొల్లపల్లి మండలంలోని రంగదాముునిపల్లి గ్రామానికి చెందిన రాగల్ల తిరుపతి–రాగిణి దంపతుల కుమారుడు రిత్విక్ (7) క్యాన్సర్ వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యచికిత్స కోసం ఆర్థికసాయం అందించాలని బాలుడి తల్లిదండ్రుల విన్నపం మేరకు ట్రస్టు సభ్యులు స్పందించారు. దాతల నుంచి రూ.75,516 విరాళాలు సేకరించి గురువారం రాత్రి బాలుడి తండ్రికి సంబంధిత చెక్కు అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఎంపీపీ శోభ, సర్పంచ్ మహేందర్‌రెడ్డి, విండో చైర్మన్ వేణుగోపాల్, ఉపసర్పంచ్ తిరుపతియాదవ్, ట్రస్టు సభ్యులు సంతోష్‌గౌడ్, లక్ష్మన్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశంగౌడ్, లచ్చయ్య, కొమురయ్య, భూమన్న, లక్ష్మీరాజం, రవీందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రాజేశం, దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీషిర్డీసాయి అఖండ నామ సంకీర్తన



అభిషేకం చేస్తున్న అర్చకులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో వారంరోజులుగా సాగిన అఖండ సాయినామ సంకీర్తన శుక్రవారంతో ముగిసింది. వేదపండితులు తిగుళ్ల విషుశర్మ, వేణుమాధవాచార్య, రాజేశ్వరశర్మ, సంజయ్ శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగుల కిషన్‌గౌడ్, రాంకిషన్‌రావు, నీలం దశరథరెడ్డి కంచి కిషన్, తవుటు రాంచంద్రం, ముంజాల తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.


'పది' విద్యార్థినులకు ఉచిత రవాణా సౌకర్యం



హాల్‌టికెట్లు అందజేస్తున్న సర్పంచ్

జగిత్యాలరూరల్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థినులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పొరండ్ల సర్పంచ్ పొగ్గల సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పొరండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలం పొలాస పదో తరగతి పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు పాఠశాల విద్యార్థినులకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.5వేల నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాస్వాములకు బిక్ష



జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీగుట్టరాజేశ్వరస్వామి ఆలయంలో హనుమాన్ దీక్షాస్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు కొత్త మోహన్, కల్లెపెల్లి దుర్గయ్య గాజుల రాజేందర్, రేపల్లె హరికృష్ణ, పుప్పాల అశోక్, జీవన్ పాల్గొన్నారు.

రోడ్డు వచ్చె.. సమస్యలు తెచ్చె

- తారురోడ్డు నిర్మాణంతో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు, డ్రైనేజీ
- మరమ్మతు చేయించాలని ప్రజల విన్నపం
- కథలాపూర్–చింతకుంట–దుంపేట రోడ్డు పరిస్థితి ఇదీ..



చింతకుంట- భూషణరావుపేట గ్రామాల మధ్య తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

కథలాపూర్: గ్రామాల్లోని గుంతలరోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని కొత్తగా తారు రోడ్డు నిర్మించారు. కొత్త రోడ్డు నిర్మాణం ఏమో గానీ సరికొత్త సమస్యలు ఏర్పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. తారు రోడ్డు ఎత్తుగా పోయడంతో విద్యుత్ తీగలు వాహనాలకు తాకేవిధంగా ఉన్నాయని, డ్రైనేజీ లోతుగా మారడంతో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, కథలాపూర్ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త తారు రోడ్డు.. సమస్యలు ఇవే

కథలాపూర్ మండల కేంద్రం నుంచి భూషణరావుపేట, చింతకుంట గ్రామాల మీదుగా దుంపేట గ్రామం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రోడ్ల భవనాల శాఖ నుంచి సుమారు రూ.3కోట్లు ఏడాది క్రితం మంజూరయ్యాయి. ఈ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. ఆయా గ్రామాల్లో తారురోడ్డు ఎత్తుగా పోయడంతో గతంలో ఉన్న విద్యుత్ వైర్లు వాహనాలకు తాకేలా మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. మరోవైపు తారురోడ్డు నిర్మించడంతో గ్రామాల్లో ఉన్న డ్రైనేజీలు లోతుగా అయి ప్రమాదాలకు నిలయంగా మారినట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లో ఎదురెదురుగా జీపులు, ఆటోలు, బస్సులు, లారీలు వస్తే లోతుగా ఉన్న డ్రైనేజీల్లోకి దూసుకెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు అంటున్నారు. రాత్రివేళ వాహనాల లైట్లకు ఎదురుగా వచ్చేవారికి కనిపించక రోడ్డుపక్కన ఉన్న మురికి కాలువలో పడిపోయిన సంఘటనలున్నాయని ప్రజలు తెలిపారు. రోడ్ల భవనాలశాఖ, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను ఎత్తుగా ఉండేట్లు సరిచేయాలని, లోతుగా మారిన డ్రైనేజీలను రోడ్డుకు సమానంగా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



భూషణరావుపేట–చింతకుంట గ్రామాల మధ్య కొత్తగా తారురోడ్డు నిర్మించారు. విద్యుత్ వైర్లు వాహనాలకు తాకి మంటలు చెలరేగుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, వాటిని సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు చెప్పినం. సుమారు 6 నెలలుగా ఇదే పరిస్థితి. అధికారులు చొరవ చూపి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు ఎత్తులో ఉండేలా చేసి సమస్య పరిష్కరించాలి.

– ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, భూషణరావుపేట

అధికారులకు లేఖ రాశాం



తారురోడ్డు నిర్మాణంతో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులోకి వచ్చాయి. విద్యుత్ వైర్ల మరమ్మతుకు రోడ్లు భవనాల శాఖ నుంచి డబ్బులు చెల్లిస్తే మేము మరమ్మతు చేయిస్తామని రెండు నెలల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులకు లేఖ రాశాం. ఆ శాఖ నుంచి నిధులు ట్రాన్స్‌కోకు చెల్లిస్తే త్వరగా మరమ్మతు చేయిస్తాం.

– ఎం.డీ జమీల్‌పాషా, ట్రాన్స్‌కో ఏఈ, కథలాపూర్

ప్రతిపాదనలు పంపిస్తేనే..



విద్యుత్ స్తంభాలు, వైర్లు మరమ్మతుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి మా శాఖకు పంపిస్తే శాఖపరంగా సమస్య ఉన్న స్థలాలను పరిశీలించి డబ్బులు చెల్లిస్తాం. సమస్యను గుర్తిస్తూ మాత్రమే లేఖ రాశారు. ప్రతిపాదనలు పంపిస్తే ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి ట్రాన్స్‌కోకు డబ్బులు చెల్లిస్తాం.

– మధు, ఆర్‌అండ్‌బీ ఏఈ, కోరుట్ల డివిజన్

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చిన్న మెట్‌పల్లిలో వారంరోజులుగా కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను మెమొంటోలతో సత్కరించారు. ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ నూతిపెల్లి గంగరాజు, ఎంపీటీసీ పంచిరి విజయ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాసవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాసాల మల్లికార్జున్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి భరోసా రైతుబీమా

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం నిరుపేద రైతు కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని యూసుఫ్‌నగర్‌కు చెందిన 5 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రైతుబీమా చెక్కులను అందజేశారు. ఎంపీపీ తోట నారాయణ, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, నాయకులు ప్రశాంత్, శేఖర్, నరేశ్, నారాయణ, సుధీర్, కళ్యాణ్, ప్రణీత్, నర్సయ్య, లక్‌పతి, రాజేందర్, విష్ణు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

కోరుట్లరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 33 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వేసవిలో చెట్లకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించేందుకు రూ.10లక్షలు కేటాయించారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, డీఈఈ అభినయ్, మేనేజర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏడీఈ ఆంజనేయరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యం

మెట్‌పల్లి: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన శుక్రవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే పాల్గొనగా పలువురు సభ్యులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా సమావేశంలో 34 అంశాలను ప్రవేశపెట్టగా, వాటికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు



పాఠశాలలో సౌకర్యాలు పరిశీలిస్తున్న ఆర్డీవో

మేడిపెల్లి: మండలంలోని తొంబర్రావుపేట్ గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కులపై ఆర్డీవో వినోద్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఎంపీపీ ఉమాదేవి, సర్పంచ్ మామిడి సత్తమ్మ, ఏఎస్సై రవీందర్‌రావు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో సివిల్ రైట్స్ డే

కథలాపూర్: మండలకేంద్రంలో శుక్రవారం మండలాధికారుల ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో జనార్ధన్, ఎంఈవో ఆనందరావు, ఎస్సై శ్వేత, అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొజన్‌కొత్తూర్ గ్రామంలో సివిల్స్ రైట్స్ డే నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పద్మ, సర్పంచ్ మహేశ్, దళిత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



కోరుట్లరూరల్: ఆలయంలో హుండీ లెక్కింపు

కోరుట్లరూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. లెక్కింపులో రూ.83,588 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ జగిత్యా డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, ఈవో విక్రమ్, పూజారి నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ వెంకన్న ఆలయంలో..

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గల వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. హుండీ లెక్కింపులో రూ.60,304 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ తోట శారద–లింగారెడ్డి, ఆలయ చైర్మన్ కటుకం రాజేశ్, ధర్మకర్తలు వెంకటేశం, సంజీవ్, లక్ష్మీరాజం, వెంకటస్వామి, వెంకటి, తోట వెంకటేశ్, గంగారాం, రాములు, గంగారాజం, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, రవి కిషోర్, ఈవో వాక్రం, పూజారి వెంకట రమణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మేడిపెల్లి: బీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్‌మాస్టర్ బన్న, శేఖర్, ఏఎస్సై హసన్ మహ్మద్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి



కథలాపూర్: పరీక్ష సామగ్రి అందిస్తున్న కిషన్‌రెడ్డి

కథలాపూర్: కథలాపూర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సిరికొండ సింగిల్‌విండో డైరెక్టర్ కందరి కిషన్‌రెడ్డి పరీక్ష సామగ్రి శుక్రవారం పంపిణీ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ గంగారెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్, దాత కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు షకీల్ శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, హాల్‌టికెట్లను సర్పంచ్ నేరేళ్ల హేమలత పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, పాఠశాల ప్రాధానోపాధ్యాయులు మహేశ్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఏపీడీ శివాజీ

ఇబ్రహీంపట్నం: మన ఊరి–మన బడి పనులను వేగంగా పూర్తి చేయాలని ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి బాలె శివాజీ కోరారు. శుక్రవారం మండలంలోని యామాపూర్, గోధూర్, ఇబ్రహీంపట్నం, వర్షకొండ గ్రామాల్లో మన ఊరి–మన బడి పనులను, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనుల పురోగతి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీవో కృపాకర్, సర్పంచ్‌లు ప్రభాకర్, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలోని పల్లెకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోర్లకు కరెంట్ సౌకర్యం కల్పించేవారు. ఇటీవల కరెంట్ సౌకర్యం తొలగించడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లికొండ రమేశ్, శంకర్, దువ్వాక రాజేశ్, నారాయణ, శివ, రంజిత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ రూరల్ మండలంలో 3 పరీక్ష కేంద్రాలు

జగిత్యాలరూరల్: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు జగిత్యాల రూరల్ మండలంలోని మూడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. పొలాస జెడ్పీహెచ్‌ఎస్, కల్లెడ జెడ్పీహెచ్‌ఎస్, చల్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు.

✦ పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు 2012–13 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సుమారు రూ.21వేల విలువగల సౌండ్ సిస్టమ్‌ను శుక్రవారం బహూకరించారు. సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ గంగరాజం, విద్యాకమిటీ చైర్మన్ దాత్రిక ఉమ, హెచ్‌ఎం మార్గం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

✦ విద్యార్థినికి సన్మానం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ముత్యాల శరణ్య వ్యాసరచన పోటీలో డివిజనల్ స్థాయిలో ప్రతిభ చాటడంతో శుక్రవారం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సన్మానించారు. సర్పంచ్ కూన సులోచన, ఎస్‌ఎంసీ చైర్మన్ అంగరి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

✦ జగిత్యాల సభకు తరలిరండి

కథలాపూర్: జగిత్యాలలో శనివారం నిర్వహించే బీఆర్‌ఎస్ జిల్లా సభకు కథలాపూర్ మండల కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్ కోరారు. జగిత్యాలలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

✦ నర్సరీల్లో బ్యాగులు ఖాళీగా ఉండొద్దు

ఇబ్రహీంపట్నం: నర్సరీల్లో బ్యాగులు ఖాళీగా ఉండొద్దని, మొలకెత్తని విత్తనాల చోట మళ్లీ విత్తనాలు నాటాలని ఎంపీడీవో ప్రభు సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఎర్దండి, కొజన్‌కొత్తూర్, ఇబ్రహీంపట్నం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఎర్దండి మల్లన్న గుట్టపై ఉపాధి కూలీలు తవ్వుతున్న కాంటూరు కందకాలను పరిశీలించారు. అనంతరం కొజన్‌కొత్తూర్‌లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

✦ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన గంగధరి (బెల్లాల) చంద్రయ్యకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.22వేల చెక్కును సర్పంచ్ గుడిసె శ్రీమతి అందజేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతో ఈ చెక్కు వచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఎంపీటీసీ ఆడెపు మల్లేశ్వరి, ఉపసర్పంచ్ పూదూరి రమేశ్, మండల కోఆప్షన్ సభ్యురాలు బీబా, నాయకులు జితేందర్ యాదవ్ ఉన్నారు.

✦ విద్యార్థులకు రక్తపరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రీజ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నీషియన్ నరేశ్, ఎంఎల్‌హెచ్‌పీ ఆకాంక్ష, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం నవీన్ పాల్గొన్నారు.

✦ ఘనంగా రథోత్సవం

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్‌లో సర్పంచ్ రామచందర్‌రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారామచంద్రుల విగ్రహాలను రథంపై ఊరేగించారు.

✦ సోమన్‌పల్లి గ్రామంలో..

జగిత్యాలరూరల్: మండలంలోని సోమన్‌పల్లిలో శ్రీరామచంద్రస్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది.

✦ జోరుగా ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు

సారంగాపూర్: బీజేపీ నాయకులు శుక్రవారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఉచితంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల మార్కండేయ, మండల నాయకులు రాకేశ్, హరీశ్, నరేశ్, మల్లేశ్, సంతోష్, దేవరాజం పాల్గొన్నారు.

సాధారణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ధర్మపురి: పట్టణంలో చేపట్టనున్న పనుల సమస్యలపై మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశంలో 2023 ఫిబ్రవరి ఆదాయ, వ్యయాలు, ఇతర బిల్లులు చెల్లింపు మొత్తం 29 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. వైస్‌చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి



మల్యాల: మాట్లాడుతున్న సీడీపీవో నర్సింగరాణి



రాయికల్: అన్నప్రాసనలో పాల్గొన్న కమిషనర్

మల్యాల: పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని మల్యాల సీడీపీవో నర్సింగరాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ ఎంపీడీవో వెంకటేశం, మండల వైద్యురాలు మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ పాల్గొన్నారు.

రాయికల్‌లో పోషణ్ పక్వాడా

రాయికల్: పట్టణంలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అలాగే ఇటిక్యాలలోని మోడల్‌స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సూపర్‌వైజర్ పద్మావతి, కమిషనర్ సంతోష్‌కుమార్, సూపరింటెండెంట్ వేణుమాధవ్, కౌన్సిలర్లు అన్వరిబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, సుజాత, బుజ్జమ్మ, సువర్ణ, అనురాధ పాల్గొన్నారు.


పెగడపల్లిలో..

పెగడపల్లి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేతుల పరిశుభ్రత, చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సారంగాపూర్: మహిళా సంఘాల్లోని సభ్యులు రుణాలకు సకాలంలో చెల్లిస్తేనే వడ్డీ మాఫీ వర్తిస్తుందని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ సొమ్మును సంఘాల వారీగా బీర్‌పూర్ గ్రామస్తులకు పంపిణీ చేశారు. మండలంలో మహిళలకు రూ.37.05లక్షల వడ్డీ మాఫీ సొమ్ము జమ అయిందన్నారు. బీర్‌పూర్‌లోని 29 సంఘాలకు రూ.2.80లక్షల వడ్డీ మాఫీ సొమ్ము ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఏపీఎం రజితారెడ్డి, సీసీలు గంగారాం, పుష్పలత, మరియ పాల్గొన్నారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



నామాపూర్ ఆలయంలో హోమం

పెగడపల్లి: మండలంలోని నంచర్ల, నామాపూర్, ఎల్లాపూర్, అయితిపల్లి గ్రామాల్లోని శ్రీరామచంద్రస్వామి ఆలయాల్లో శుక్రవారం శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా సాగింది. నామాపూర్‌లో 108 హోమ గుండాలతో యజ్ఞం నిర్వహించి రోటీగూడెం మౌన స్వామితో గీతోపదేశం చేశారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ స్నేహలత, ఆయా గ్రామాల సర్పంచులు మహేందర్‌రెడ్డి, కొండయ్య, అంజమ్మ, కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు గంగాధర్, రజిత, రవి, ఆలయ కమిటీ చైర్మన్లు బండి వెంకన్న, వీరారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.